
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
మంగళవారం 24 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం


ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.30 (309.9534)	14,846	44,020
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	3,802.29	3,586.06
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.86 (45.56)	33,030	36,950

చికెన్ ధరలు: లైవ్: రూ.140 డ్రెస్: రూ.210 స్కిన్‌లెస్: రూ.240

ఆర్‌ఆర్‌ఆర్ స్పీడ్

- అలైన్‌మెంట్‌లో మార్పు ఉండదని స్పష్టం చేసిన ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ విలువకు, బహిరంగ మార్కెట్ మధ్య భారీ తేడా
- భూములిచ్చేందుకు ముందుకు రాని రైతులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భారత్‌మాల పరియోజన కింద నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చే ప్రసక్తి లేదని సర్కారు స్పష్టం చేసింది. ప్రస్తుత అలైన్‌మెంట్‌తో రైతులు నష్టపోతున్నారని, దీనిలో మార్పులు చేయాలని సీపీఎం బృందంతో పాటు రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే అలైన్‌మెంట్‌ను మార్చే ప్రసక్తే లేదని, అవసరమైతే భూములు కోల్పోనున్న రైతులకు పరిహారం పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అంతేగాక ఆర్‌ఆర్‌ఆర్ పనులు చకచకా చేపట్టేందుకు ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్ ప్రకారం ముందుకు సాగాలని ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది.
- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)



ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం నిర్మాణంలో భాగంగా జిల్లాలో 1,927ఎకరాల మేర భూసేకరణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరో 188 ఎకరాలు చౌటుప్పల్ వద్ద జంక్షన్ కోసం భూసేకరణకు అధికారులు నోటీసులు జారీచేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు రైతుల పొలాల్లో సర్వే నిర్వహించి హద్దురాళ్లను సైతం పాతారు. ఏ రైతు ఎంతమేరకు భూములు కోల్పోతున్నారనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 3డీ నోటిఫికేషన్ జారీచేసింది. త్వరలో రైతులకు ఎంత మేరకు పరిహారం అందించాలనే అంశంపై అవార్డు ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్ ప్రకారం ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం మొత్తం సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 19 మండలాలకు చెందిన 113 గ్రామాల మీదుగా వెళ్తోంది. యాదాద్రి జిల్లాలో 34 గ్రామాల మీదుగా ఆర్‌ఆర్‌ఆర్ నిర్మించనున్నారు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ ఏర్పాటుపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పరిశీలిస్తున్నారు.

భూములిచ్చేందుకు రైతులు ససేమిరా

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆర్‌ఆర్‌ఆర్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. భువనగిరి మండలం రాయిగిరి రైతులు ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని సుదీర్ఘంగా పోరాటం చేస్తున్నారు. ఈ మేరకు హైకోర్టును ఆశ్రయించి స్టే కూడా సాధించారు. చౌటుప్పల్‌లో జంక్షన్ ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సర్వం కోల్పోతున్నామని రైతులు లబోదిబోమంటున్నారు. విలువైన భూములు కోల్పోకుండా అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ రైతులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు.

కొనసాగుతున్న భూ సర్వే



భారత్‌మాల పరియోజన కింద నిర్మిస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ యాదాద్రి జిల్లాలో 59.33 కిలోమీటర్లు ఉండనుంది. అందుకు తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో 1,927 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. దీని కి సంబంధించి త్రీడీ నోటిఫికేషన్ కూడా జారీ అయ్యింది. ఉత్తరభాగ రింగ్ రోడ్డును దక్షిణభాగానికి కలిపేందుకు చౌటుప్పల్‌లో 258ఎకరాలు సేకరించేందుకు సర్వే పనులు కొనసాగుతున్నాయి. భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని రాయిగిరికి చెందిన రైతులు ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించారు. భూసేకరణ నిలిపివేయాలని కోర్టుస్టే విధించింది. కోర్టులో విచారణ జరుగుతుండటంతో రాయిగిరి రైతులకు సంబంధించిన భూసేకరణ నిలిచింది. కోర్టు స్టేను వెకెట్ చేయించేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. చౌటుప్పల్‌లో జంక్షన్‌కు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. సర్వే పనులు అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం ఆర్‌ఆర్‌ఆర్‌పై ముందుకే వెళ్తోంది.

భూమికి బదులు భూమి ఇవ్వాలి



చౌటుప్పల్ టౌన్: నాకున్న 12 ఎకరాల్లో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ట్రిపుల్‌ఆర్‌లో కోల్పోతున్నా. అందుకు ప్రభుత్వం భూమికి బదులు భూమి ఇవ్వాలి. లేదంటే బహిరంగ మార్కెట్ విలువ ప్రకారంగా పరిహారం చెల్లించాలి. నాలుగేళ్ల క్రితం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి స్థానిక పరిశ్రమకు 132/11కేవీ లైన్ వేయడంతో నా నాలుగెకరాల వ్యవసాయ భూమికి తీవ్ర నష్టం వాటిల్లింది. మళ్లీ ట్రిపుల్‌ఆర్‌తో నష్టం కలిగించొద్దు. రాష్ట్ర ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి.
- జాల మైసయ్య, తంగడపల్లి, చౌటుప్పల్ మునిసిపాలిటీ

పరిహారంపై అధ్యయనం

ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు, ప్లాట్లు కోల్పోతున్న రైతులకు, యజమానులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. నెలరోజుల్లోగా పరిహారంపై అవార్డు ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటోంది. అవార్డు ప్రకటించేందుకు ఇప్పటికే రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లోని భూముల ధరలపై అధ్యయనం చేశారు. రిజిస్ట్రేషన్ విలువ, బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు ఎలా ఉన్నాయో అధికారులు పరిశీలించి, ప్రభుత్వానికి నివేదికలు పంపేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత అవార్డును ఖరారు చేసే అవకాశం ఉంది. ఆర్‌ఆర్‌ఆర్ కోసం జిల్లాలోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో భూములు సేకరిస్తున్నారు. తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో ఎకరానికి రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు ధర ఉంది. భువనగిరి, వలిగొండలో రూ.7.50లక్షల నుంచి రూ.13.50లక్షల వరకు ధర ఉంది. చౌటుప్పల్‌లో రూ.12లక్షల వరకు ధరలు పలుకుతోంది. అయితే బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఎకరానికి ఆయా ప్రాంతాల్లో రూ.1కోటి నుంచి రూ.4కోట్లకు పైగా ధరలు ఉన్నాయి. ఇళ్ల స్థలాలు గజానికి రూ.800 నుంచి రూ.3,500వరకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర ఉండగా, బహిరంగ మార్కెట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో రూ.6వేలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.10నుంచి రూ.15వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.30వేలకు పైగానే ఉంది. జిల్లా యంత్రాంగం ఎంత మేరకు పరిహారం చెల్లించాలని ప్రతిపాదిస్తుందో చూసిన తరువాత ప్రభుత్వం దాన్ని ఎన్నిరెట్లు పెంచాలో ఆలోచిస్తుంది.

నేతల హామీలపై నీలినీడలు

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని గతంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అలైన్‌మెంట్ మార్పు ప్రసక్తేలేదని ప్రభుత్వం తేల్చి చెప్పడంతో స్థానిక నేతలు కూడా రైతులకు ఎలాంటి హామీ ఇవ్వలేకపోతున్నారు. అయితే స్థానిక రైతులు మాత్రం తమ పోరాటం ఆపే ప్రసక్తేలేదని తేల్చి చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను మార్చాలని, ప్రస్తుత రోడ్లు రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో రైతులకు మద్దతు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సైతం ప్రభుత్వంతో చర్చించి అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అయితే ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తుండటంతో పాటు రైతులకు సంబంధించిన భూములపై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరుతూ జిల్లాయంత్రాంగం రాష్ట్ర హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. మరోవైపు రాయిగిరి రెవెన్యూ గ్రామం నుంచి ఇప్పటికే ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ఈ రోడ్డుకు దక్షిణ, ఉత్తర భాగాలకు కలిపి ఒకే నెంబరు ఇవ్వాలని కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి విన్నవించారు. రైతులతో చర్చించి మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి సీఎం సూచించారు. ప్రభుత్వ పరిణామాలను పరిశీలిస్తుంటే ఆర్‌ఆర్‌ఆర్ పనులు మున్ముందు వేగవంతం కానున్నాయి.



నిస్వార్థ సేవకులు.. విద్యార్థి సైనికులు

సామాజిక సేవలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు
ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా వాసులు
కేంద్రమంత్రుల నుంచి ప్రశంసలు

ఒక మనిషి మరొకరికి సహకరించడం మానవతా లక్షణం. అదే పదిమందికి మేలు కలిగేలా చూడటమే సాంఘిక సేవా లక్షణం. భావి భారత పౌరులైన విద్యార్థుల్లో ఈ రెండు లక్షణాలను పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం. విద్యార్థి సమూహం-సమాజం, కళాశాల-గ్రామం, జ్ఞానం-ఆచరణ లక్ష్యాలుగా అత్యవసర పరిస్థితుల్లో తామున్నామంటూ ముందుకు నడుస్తారు ఈ విద్యార్థి సైనికులు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామీణ ప్రాంతాల్లో స్వయంగా చెత్తను శుభ్రం చేసి ప్రజల్లో పారిశుధ్య జ్ఞానాన్ని కలిగించడంతోపాటు, ప్రకృతి విపత్తుల సమయంలో నిస్వార్థ సేవలందిస్తారు. వీరి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఏటా ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు వలంటీర్లకు దక్కింది.
● దేవరకొండ, మిర్యాలగూడ టౌన్



దేవరకొండలో కళాశాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

●7లో..

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి



ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించి, మాట్లాడారు. అక్టోబరు 3వ తేదీ నుంచి 9వతేదీ వరకు జరుగనున్న ఓపెన్‌స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు అన్నిఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 355 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ నెల 24న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో జరిగే సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా 149 దరఖాస్తులను వచ్చాయన్నారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సతీష్‌కుమార్, డీఆర్‌డీవో వీవీ అప్పారావు, సీపీవో ఎల్ కిషన్, అన్నిశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళా పొదుపు సంఘం లోన్ డబ్బుల విషయంలో సభ్యురాలిని దూషించిన ఆర్పీ అన్నెపర్తి రాణిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పర్వతం భాగ్యమ్మ కోరారు. ఆమె వెంట గోదూరి భిక్షపతి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : మండలంలోని రామాపురం గ్రామంలో ఓటర్ జాబితాలో అవకతవకలు జరిగాయని గ్రామానికి చెందిన రంగిశెట్టి గణేష్ ఫిర్యాదు చేశారు.

గ్రామ పరిధిలో ఉన్న బీమా సిమెంట్ పరిశ్రమ నిలిచి పదేళ్లు అవుతుందని, ఆ పరిశ్రమకు సంబంధించి సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు స్థానికంగా లేకున్నా తప్పుడు ధ్రువపత్రాలతో ఓట్లు నమోదు చేసుకున్నారని ఆరోపించారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలి



జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 23: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను కేటాయించాలని డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల కమిటీ అధ్యక్షుడు షేక్ నయీం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టి, మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాటరీ పద్ధతిలో అర్హులైన 804 మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించిందన్నారు. అయితే నేటికీ ఇళ్లను పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల కిందట కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఇళ్ల పనులు జరుగుతున్నాయని త్వరలో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే నేటికీ పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు పంపిణీ చేయని పక్షంలో త్వరలో డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి తాము ప్రవేశం చేస్తామన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు ఎండీ.రవీ, రాచకొండ ఉపేందర్, దుబ్బ సైదులు, మెగావత్ రవినాయక్, ఎస్‌కే నసీర్‌బాబా, వెంకన్న, ఆశా, హుస్సెన్బీ, నీలమ్మ, భిక్షమమ్మ, హసీనా, శారద, రామిని, నాగమణి, నగేష్, నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని కుడకుడలోని ప్రభుత్వ భూమిలో, నేరేడుచర్ల మునిసిపాలిటీ పరిధిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, మాట్లాడారు. ఆరేళ్ల నుంచి నేరేడుచర్లలో 153, సూర్యాపేటలో 83 మంది పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, కొంతమంది బీఆర్ఎస్ నాయకులు దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా గుడిసెవాసులపై బెదిరింపులకు పాల్పడున్నారని తెలిపారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, గొడ్డలి నర్సయ్య, పేర్ల నాగయ్య, చంద్రకళ, రేణుక, జయమ్మ, ఎస్‌కె. హుసెన్, సయ్యద్, లింగయ్య, లక్ష్మీ, పావని, మరియమ్మ, సత్యమ్మ, రేష్మ, అంజయ్య, మోహన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

తండాల్లో తాగునీటి కోసం తండ్లాట

గుర్రంపోడుతండా, పాత దొనబండతండాల్లో ఖాళీ బిందెలతో మహిళల నిరసన



గుర్రంబోడుతండాలో సంత్ సేవాలాల్ దేవాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు, యువకులు

మఠంపల్లి, సెప్టెంబరు 23 : మండలంలోని గుర్రంబోడుతండా, పాత దొనబండతండాలలో ఐదు రోజులుగా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలని తండాలకు చెందిన యువకులు, మహిళలు సోమవారం ఆందోళన బాటపట్టారు. గుర్రంబోడుతండాలో సంత్ సేవాలాల్ దేవాలయ ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తండాల్లో కొన్ని రోజులుగా చేతిపంపులు, చేతిపంపులు పూర్తిగా ఇంకిపోయాయన్నారు. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు.

మిషన్ భగీరథ నీరు ఏరోజు వస్తుందో తెలియడం లేదన్నారు. తండా శివార్లలోని వ్యవసాయ మోటార్ల వద్దకు తాగునీటిని తెచ్చుకుంటున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలకు ట్యాంకర్లు ఇచ్చినప్పటికీ నిర్వహణ సరిగా లేక పనిచేయడం లేదని ఆరోపించారు. నీటిఎద్దడిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. అరగంట తర్వాత ఆందోళన విరమించారు. తాదునీటి ఎద్దడిపై పంచాయతీ కార్యదర్శులను సంప్రదించగా సమస్య ఉన్న మాట వాస్తవమేనని, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి, తండాల వాసులకు నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు మంత్రి ఉత్తమ్ క్షేత్రస్థాయి పర్యటన



హుజూర్‌నగర్, సెప్టెంబరు 23 : భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు, సాగర్ ఎడమకాల్వ, ఇతర ప్రాంతాల్లో చేపట్టిన పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేడు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. రేజింతా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.

మంత్రి పర్యటన ఇలా

మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో కోదాడకు చేరుకుంటారు.

11 గంటలకు నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తారు.

12.30 గంటలకు ఆర్లెగూడెం రెడ్లకుంట మేజర్, 1.30 గంటలకు చిలుకూరు మండలం నారాయణపురం చెరువు గండి మరమ్మతులు, 2.30 కరక్కాయలగూడెం సమీపంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ గండి పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తారు.

3.30గంటలకు మఠంపల్లి మండలం చౌటపల్లి చెరువు గండి మరమ్మతులు, 4.30కు మామిళ్ల చెరువు గండి మరమ్మతుల పనుల పరిశీలన చేస్తారు. అనంతరం ఆరు గంటల నుంచి 8 గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలో ప్రధాన శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. 10.30 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.

అవసరాలకు తగ్గట్టు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాం



అన్నారంబ్రిడ్జి సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఈ ఫ్రాంక్లిన్

పెన్‌పహాడ్, సెప్టెంబరు 23 : రైతుల అవసరాలకు తగ్గట్టు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు ఎస్‌ఈ ఫ్రాంక్లిన్ తెలిపారు. సోమవారం పెన్‌పహాడ్ మండలం అన్నారంబ్రిడ్జి గ్రామంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌తో లోవోల్టేజీ సమస్య ఎదుర్కొంటున్నారు. దీంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి రూ.1.20 కోట్లతో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సబ్‌స్టేషన్ కింద మండలంలోని నాగులపాటి అన్నారం, అన్నారంబ్రిడ్జి, నారాయణగూడెం, నాగులపహాడ్, లింగాల, అనంతారం, పొట్లపహాడ్ గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారన్నారు. వీరందరూ సాగర్ ఎడమకాల్వలో నీళ్లు పారని సమయాల్లో తమ భూముల్లోని విద్యుత్ మోటార్ల ద్వారా వ్యవసాయం చేసుకోవచ్చన్నారు. ఇక ఎలాంటి లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. విద్యుత్ సామర్థ్యం పెంచడంతో విద్యుత్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ డీఈ గాలినాయుడు, ఏడీఈ ఇందిర, డీఈ శ్రీనివాసులు, ఏఈ రమేష్, లైన్‌మన్లు గార్లపాటి సురేందర్‌రెడ్డి, రాము, ఆపరేటర్లు విఘ్నేశ్వర్, శివాజీ, ఒగ్గు రవికుమార్ పాల్గొన్నారు.

మహారుద్రాభిషేకం మహోత్సవానికి కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక ఇస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 23 : హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్‌లోని పాఠశాలలో అక్టోబరు 27న నిర్వహించనున్న మహారుద్రాభిషేకం మహోత్సవానికి హాజరుకావాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఏఎస్పీ మేక నాగేశ్వరరావు, డీఈవో అశోక్‌కుమార్‌లకు కమిటీ కన్వీనర్ గజ్జి ప్రభాకర్ సోమవారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎప్పుడూ ఎక్కడా లేని విధంగా మహారుద్రాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కార్యక్రమ నిర్వహణ కోసం ఏఎస్పీ మేక నాగేశ్వరరావును అనుమతులు మంజూరు చేయాలని కోరారు. లోక కల్యాణార్థం ఎనిమిది అడుగుల మట్టి శివలింగానికి రుద్రాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్, ఏఎస్పీ వేర్వేరుగా రుద్రాభిషేకం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో గుండా శ్రీనివాస్, విజయ్, సుధాకర్, అశోక్ పాల్గొన్నారు.

మిస్టరీగా ముల్కలపల్లి వివాహిత మృతి

- ఆత్మహత్యగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణ
- ఆత్మహత్యను హత్యగా చిత్రీకరిస్తున్నారని మహిళ భర్త, బంధువుల ఆరోపణ
- వివాదాస్పదమవడంతో ఏఎస్పీ నేతృత్వంలో విచారణ

నల్లగొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): [illegible] తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కేసు వివరాల్లోకి వెళ్తే ..ఆగస్టు 29న ముల్కలపల్లికి చెందిన [illegible] ఆ పరిహారాన్ని ఇవ్వాలని పంచాయతీలో తీర్మానించారు. అయితే [illegible] పరిస్థితి ఏర్పడింది.

యాదగిరికొండపై హరిహరులకు పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 23: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి కొండపై సోమవారం హరి హరులకు విశేషపూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామివారికి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొపిన అర్చకులు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకారమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండీజోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొన సాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివ పార్వతుల ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,62,176 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

అంతర్రాష్ట్ర కేబుల్ చోరీ ముఠా అరెస్టు

- యాదాద్రి జిల్లా భువనగిరిలో రూ. 35లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్‌చంద్ర



యదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న డీసీపీ రాజేష్‌చంద్ర, కింద ఎనిమిది మంది నిందితులు, స్వాధీనం చేసుకున్న సొత్తు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 23: తేలికగా డబ్బు సంపాదించేందుకు విద్యుత్ కేబుల్ చోరీ చేస్తున్న 8 మంది సభ్యులున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.35లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాజేష్‌చంద్ర ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉపాధి నిమిత్తం వచ్చి హైదరాబాద్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన బీహార్‌కు చెందిన ఐదుగురు, హైదరాబాద్‌లోని జీడిమెట్ల, నారాయణగూడకు చెందిన ఇద్దరు, జార్ఖం డ్‌కు చెందిన మరొకరు సులభంగా డబ్బు సంపాదించేందుకు విద్యుత్ కేబుల్ చోరీ చేసేందుకు ముఠాగా ఏర్పడ్డారు. అయితే బీహార్‌కు చెందిన బిక్రమ్‌కుమార్ సింగ్, ప్రదీప్‌కుమార్ మిశ్రా ముఠా నాయకులుగా వ్యవహరిస్తూ మిగిలిన ఆరుగురితో దొంగతనాలు చేయించేవారు. ఇద్దరు ముఠా నాయకులు వంతుల వారీగా మిగతా ఆరుగురిని ప్రతినిత్యం చోరీలకు తీసుకెళ్లేవారు. ఇందుకోసం మూడు కార్లు, ఓ ట్రాలీ ఆటోను కొనుగోలు చేశారు. చోరీ చేసే ప్రదేశాన్ని ముందుగానే ఎంచుకుని కారులో ఆరుగురిని వదిలి వెళ్లేవారు. చోరీ చేయడం పూర్తయ్యాక తెల్లవారుజామున ఆటోలో విద్యుత్ వైర్లను తీసుకుని నిర్దేశిత ప్రదేశానికి వెళ్లేవారు. అక్కడినుంచి అందరూ కలిసి ప్రతిసారి ఓ కొత్త దుకాణంలో విద్యుత్ కేబుల్స్ విక్రయిం చేవారు. ఈ ముఠా గత ఏడాది యాదాద్రి జోన్ పరిధిలో 44, మల్కాజిగిరి జోన్ పరిధిలో 2 మొత్తంగా 46 ప్రదేశాల్లో విద్యుత్ కేబుల్స్ ఎత్తుకెళ్లారు. విద్యుత్ సరఫరా అవుతున్నా వైర్లను కూడా ఆ ముఠా సభ్యులు సులువుగా కట్ చేసేవారు. రియల్‌ఎస్టేట్ వెంచర్లు టార్గెట్‌గా చోరీ చేసిన వైర్లను సంఘటనా స్థలంలోనే ముక్కలు ముక్కలుగా చేసి వెంట తీసుకెళ్లిన ఆటో ట్రాలీలో వేసి కనిపించకుండా కార్పెట్ కప్పేవారు. ఇటీవల రియల్ ఎస్టేట్ వెంచర్ యజమానులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా పోలీసులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా సోమవారం బొమ్మల రామారం మండలం చీకటి మామిడి క్రాస్‌రోడ్స్ వద్ద చేపట్టిన వాహన తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆటో ట్రాలీలో ప్రయాణిస్తున్న బిహార్‌కు చెందిన బిక్రమ్‌కుమార్ సింగ్, ప్రదీప్ కుమార్ మిశ్ర, మహేందర్‌రామ్, శ్రవణ్ మాథో, రాజ్‌కుమార్ రాయ్, హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన రామ్‌కుమార్ సింగ్, నారాయణగూడకు చెందిన అమిత్, జార్ఖండ్‌కు చెందిన గోవింద్ మండల్ అనుమానాస్పద స్థితిలో అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా 46ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. దాంతో వారి నుంచి రూ.35లక్షల విలువైన 200 కిలోల రాగి తీగ, మూడు కార్లు, ట్రాలీ ఆటో 8 మొబైల్ ఫోన్లు, చోరీకి వాడే ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు లోతైన విచారణ కోసం ఆ ముఠాను చర్లపల్లి జైలుకు తరలించారు. ముఠాను చాకచక్యంగా పట్టుకున్న బొమ్మలరామారం, జిల్లా క్రైం పోలీసులను రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు అభినందిస్తూ నగదు రివార్డు అందజేశారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, భువనగిరి రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, బొమ్మలరామారం ఎస్ఐ శ్రీశైలం, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాజు, ఎండీ మహబూబ్, నాగార్జున పాల్గొన్నారు. విద్యుత్ కేబుల్ చోరీ నివారణకు త్వరలో టీఎస్‌పీడీసీఎల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లలో అనుమానాస్పదంగా కనిపించే వారిపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీసీపీ కోరారు.

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్యకు మాతృ వియోగం

- నేడు మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించనున్న కుటుంబ సభ్యులు



రాములమ్మ (ఫైల్)

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 23 : డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల సోమయ్య తల్లి రాములమ్మ తల్లి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు రాములమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సోమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, రాములమ్మ కుటుంబ సభ్యులు అంగీకారంతో ఆమె పార్థీవ దేహాన్ని మంగళవారం మెడికల్ కళాశాలకు అందించనున్నారు.

చౌటుప్పల్‌లో పాతబస్తీ యువకుల హల్‌చల్

- ర్యాష్ డ్రైవింగ్‌ను ప్రశ్నించిన కౌన్సిలర్ భర్తకు కత్తిపోట్లు
- చితకబాదిన స్థానికులు.. కారు అద్దాలు ధ్వంసం



చౌటుప్పల్‌లో చికిత్స పొందుతున్న కౌన్సిలర్ హిమబిందు భర్త అరుణ్‌కుమార్

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 23: మద్యం మత్తులో ఓ వీధిలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులను ప్రశ్నించినందుకు కౌన్సిలర్ భర్తతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను యువకులు కత్తులతో పొడిచారు. ఈ ఘటనతో స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేయటంతో తప్పించుకునే ప్రయత్నంలో గాయపడ్డారు. సోమవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఈ సంఘటన జరిగింది. చౌటు ప్పల్ సీఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఆరుగురు యువకులు డిల్లీ నంబర్ ప్లేట్‌తో ఉన్న కారులో ఉదయంనుంచి చౌటుప్పల్ పట్టణంలోని 9వవార్డు, మైత్రి వనంలో మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ జులాయిగా తిరుగుతున్నారు. ఇది గమనించిన స్థానిక కౌన్సిలర్ హిమబిందు భర్త అరుణ్‌కుమార్, దాదాపుగా 50మంది యువకుల కారును వెంబడించారు. దాంతో మైత్రి వనంలో అద్దెకు ఉంటున్న యువకుల బంధువు యువతి ఇంటికి వెళ్లా రు. అక్కడ పట్టుకోవడానికి స్థానికులు యత్నిస్తుండగా దుండగులు కారులో నుంచి కత్తులు తీసి పట్టుకోబోయిన దండు అరుణ్‌కుమార్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి, సుర్వి సురేందర్‌ను కత్తులతో పొడవటంతో స్వ ల్ప గాయాలయ్యాయి. దాంతో వెంటనే ఆ ముగ్గురిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. స్థానికులు ఆ యువకులను పట్టుకుని చితకబాది కా రు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో భయంతో ఇద్దరు యువకులు ఓ భవనం పై నుంచి దూకి పారిపోయేందుకు యత్నించగా తీవ్రగాయలయ్యాయి. ఓ ఇద్దరు ఇంట్లో దాక్కోగా, మరో ఇద్దరు పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో దాక్కున్న ఇద్దరిని పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. భవనంపైనుంచి దూకిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పాతబస్తీకి చెందిన యువకులు ఈ ప్రాంతంలో కత్తులతో ఎందుకు సంచారిస్తున్నారనే, వచ్చిన ఆరుగురు యువకులు ఎవరనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న జాషువా

డిండి, సెప్టెంబరు 23: నల్లగొండ జిల్లా డిండి మండలంలోని గోనకోలు గ్రామానికి చెందిన రతన్ జాషువా మొదటి జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. జాషువా నాగోల్‌లోని భూపతి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం హైదరాబాద్‌లోని కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్ పోటీల్లో రతన్ జాషువా బంగారు పతకం సాధించాడు. ఈ పోటీల్లో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన జాషువాకు తైక్వాండో ప్రపంచ విజేత సింధుతపస్వి బంగారు పతకం, ప్రశంసపత్రం అందజేశారు. జాషువా బంగారు పతకం సాధించడంతో గోనగోలు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాషువా తండ్రి జానయ్య హైదరాబాద్‌లో హోంగార్డుగా చేస్తున్నారు.

నవోదయ ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర, సెప్టెంబరు 23: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2025- 26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్ష ఎంపికకు హాజరయ్యేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును పరిపాలన కారణాల రీత్యా అక్టోబరు 7వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ, లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రస్తుతం 5వ తరగతిత ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే చదువుతూ ఉండి, అభ్యర్థుల తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకు కోసం ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన ధ్రువీకరణపత్రం, ఫొటోతో దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని తెలిపారు.

కారు ఢీకొని మూడు ముక్కలైన ట్రాక్టర్


మూడు భాగాలుగా విడిపోయిన ట్రాక్టర్

వేములపల్లి, సెప్టెంబరు 23: కారు అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొనగా ట్రాక్టర్ మూడు ముక్కలుగా విడిపోయింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని రావువారిగూడెం గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... కేతేపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన దయాకర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి కారులో మిర్యాలగూడ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో రావువారిగూడెం గ్రామానికి చెందిన రైతు శ్రీధర్‌రెడ్డి తన వరి పొలానికి మందులు పిచికారీ చేసేందుకు ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచాడు. అదే సమయానికి అక్కడికి చేరుకున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ మూడు భాగాలుగా దెబ్బతిని విడిపోయాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో కారులో ఉన్న దయాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు స్వల్పగాయాలతో బయటపడగా పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

11.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పెన్‌పహాడ్, అనంతగిరి, సెప్టెంబరు 23: సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్, అనంతగిరి మండలాల్లో పోలీసులు సోమవారం 11.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పెన్‌పహాడ్ మండలం నాగులపాటిఅన్నారం గ్రామానికి చెందిన నకిరేకంటి బిక్షం ఇంట్లో తొమ్మి క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వ ఉండడంతో పెన్‌పహాడ్ పోలీసులు పట్టుకున్నారు. నాగులపాటిఅన్నారం గ్రామానికి చెందిన పిండిపోలు పర్వతాలు నకిరేకంటి బిక్షం ఇంట్లో నిల్వ ఉంచినట్లు పోలీసులు తెలిపారు. పిండిపోలు పర్వతాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్‌కు చెందిన పల్లెపంగు శ్రీహరి, రేపాల వెంకటేశ్వర్లు ఇద్దరు కలిసి టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్‌పై సుమారు రెండున్నర క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

మారథాన్ విజేతలకు బహుమతులు



జిల్లాస్థాయి 5కే మారథాన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 23: జిల్లాస్థాయి 5కే మారథన్ పోటీల విజేతలకు నల్లగొండ ఉమ్మడి జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ పసుపుల మధిలేటి, ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ సోమవారం బహుమతులు అందజేశారు. యూత్ ఫెస్ట్ 2024 లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి 5కే మారథన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్జీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, సురేష్‌బాబు, ప్రసన్నకుమార్, నాగరాజు, భాగ్యలక్ష్మి, వెంకట్‌రెడ్డి, కోటయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవే లక్ష్యంగా..

- సామాజిక సేవలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు
- ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా వలంటీర్లు
- కేంద్రమంత్రుల నుంచి ప్రశంసలు



చందంపేట మండలం వెంకటితండాలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు(ఫైల్)

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం నేషనల్ సర్వీస్ స్కీం 1969లో ప్రారంభమైంది. విద్యార్థుల్లో దేశభక్తిని పెంచడంతో పాటు మానవతా విలువలు, సేవాగుణం నింపుతోంది. విద్యార్థులను సైనికులుగా తీర్చిదిద్దుతూ జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఎన్‌ఎస్‌ఎస్ ముందుకు సాగుతోంది.

\- మిర్యాలగూడ టౌన్

కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం పెంచడం, నిరక్షరాస్యత, పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించడం, మురికి వాడలకు సేవలందించడం, కళాశాల పరిసన గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం. ప్రకృతి విలయాలు సంభవించిన తరుణంలో సహాయం అందించడం, అంటు వ్యాధులను అరికట్టడం, విరాళాలు సేకరించడం ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యాలు.

ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకల్లో మన వలంటీర్లు

ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని నాలుగు విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న విద్యార్థులను తొలిసారి ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు కేంద్రప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 16మంది బృందం పాల్గొంది. ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నల్లగొండ జిల్లాకు చెందిన నర్సింగ్ కోటయ్య కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు. ఈ బృందాన్ని కేంద్ర మంత్రి మనసుక్ మాండవీయ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అభినందించారు.

ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు


విద్యార్థులను సైనికులుగా తయారు చేయడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం. కాలేజీ అండ్ విలేజ్, క్యాంపస్ అండ్ కమ్యూనిటీ, నాలెడ్జ్ అండ్ యాక్షన్ నినాదాలతో జాతీయ సేవా పథకం పని చేస్తోంది. కళాశాల నుంచి 200 మంది విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో భాగస్వామ్యులు కావడం హర్షనీయం. జాతీయ సేవాపథకంలో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

\- మల్లిరెడ్డి భీమార్జున్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కేఎన్‌ఎం ప్రభుత్వ కళాశాల, మిర్యాలగూడ.

ఎంంకేఆర్ కళాశాల వలంటీర్లు

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రెండు యూనిట్లుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఒక్కో యూనిట్‌లో 100 మంది వలంటీర్లు ఉన్నారు. గ్రామాల్లో క్యాంపులు నిర్వహించేందుకు ఒక్కో యూనిట్ నుంచి 45మంది, రెండు యూనిట్లలో కలిపి 90మంది ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ నుంచి మే వరకు వారానికి రెండు నుంచి మూడు రోజులు పలు సేవా కార్యక్రమాలు చేపడతారు. ఈ సంవత్సరం మార్చి 20నుంచి 26వరకు చందంపేట మండలం పోలేపల్లి, వెంకటితండాల్లో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మకట్‌లాల్, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి కార్యక్రమాలు చేపట్టారు. కంపచెట్లు తొలగింపు, రోడ్లను శుభ్రం చేయడం, స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం, ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా వలంటీర్లు

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా పనిచేయడం సంతోషంగా ఉంది


మూడు సంవత్సరాలుగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు తోటి వలంటీర్లతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించాం. శ్రమదానం, ప్రజలకు అవగాహన కల్పించాం.

\- శిరీష, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ బీఏ తృతీయ సంవత్సరం ,దేవరకొండ

సేవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం


ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మకట్‌లాల్, ప్రిన్సిపాల్ సహకారాలతో వలంటీర్‌గా సేవలు అందించా. గ్రామాల్లో కంపచెట్లు తొలగించడం, స్వచ్ఛభారత్, కాల్వలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు నిర్వహించాం. సేవ చేయడమే లక్ష్యంగా వెళుతున్నాం.

\- కాట్రావత్ నరేష్, బీకాం తృతీయ సంవత్సరం

కళాశాల నుంచి ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు


ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రతి సంవత్సరం నియోజకవర్గంలోని గ్రామాల పరిధిలో సేవలు అందిస్తున్నాం. ఎన్‌ఎస్‌ఎస రెండు యూనిట్లు ఏర్పాటు చేసి 90 మంది వలంటీర్లు ప్రజలను చైతన్యపరచడం, ఓటుహక్కుపై అవగాహన కల్పించడం, మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాం.

\- డాక్టర్ మకట్‌లాల్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి, ఎంకేఆర్ కళాశాల దేవరకొండ.

దారి బాగు చేశారు.. బాధలు తీర్చారు

● బూరుగడ్డ- గోపాలపురం గ్రామాల మధ్య రాకపోకల పునరుద్ధరణ ● సమీప గ్రామ ప్రజలకు రవాణా మార్గం సుగమం


హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ- గోపాలపురం గ్రామాల మధ్య రాకపోకలు పునరుద్ధరిస్తున్న సిబ్బంది

హుజూర్‌నగర్, సెప్టెంబరు 23: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ- గోపాలపురం గ్రామాల మధ్య రాకపోకలను సోమవారం ఉదయం పునరుద్ధరించారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో చెరువు కట్ట పక్కనే ఉన్న గోపాలపురం-బూరుగడ్డ గ్రామాల మధ్య వరద నీరు పొంగి పొర్లడంతో అధికారులు రహదారికి గండి కొట్టారు. దీంతో బూరుగడ్డ మాచవరం కరక్కాయలగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విద్యార్థులు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఆది, సోమవారం అధికారులు గ్రామాల మధ్య ఉన్న రహదారికి రెండు లైన్లు గూనలు వేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు ఈ రోడ్డు గుండా వెళ్లారు. గత నెల 31వ తేదీన భారీ వర్షం కురవగా బూరుగడ్డ నల్ల చెరువుకు సంబంధించి శివాలయం వద్ద చెరువు కట్ట తెగి రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారి కొట్టుకుపోయింది. రెండురోజుల క్రితం చెరువు కట్ట పనులు ప్రారంభించగా మళ్లీ ముత్యాల బ్రాంచ్ ఎంబీ కెనాల్ ఎస్కేప్ నుంచి భారీ వరద నీరు, సాగర్ నీరు పోటెత్తడంతో రోడ్డుకు గండి కొట్టారు. బూరుగడ్డ, కరక్కాయలగూడెం, గోపాలపురం గ్రామాల మధ్య ఉన్న నల్లచెరువు గండి పూడ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం రహదారి పనులు పూర్తి చేసిన అధికారులు తిరిగి చెరువు కట్ట పనులు పూర్తిచేసేందుకు దృష్టి సారించారు. చెరువు కట్టగండి పూడ్చాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మండలంలోని బూరుగడ్డ నల్లచెరువు సంబంధించి సుమారు 140ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు శిఖం సగం భూమి ఆక్రమణకు గురైంది. చెరువు చుట్టూ ఉన్న భూస్వాములు పెద్ద ఎత్తున కబ్జాలు చేయగా శిఖం భూమి ఆక్రమణలో ఉండిపోయింది. చెరువు ఆక్రమణ గురి కావడంతో ఇటీవల కురిసిన భారీ వర్షానికి చెరుకు గండి పడింది. చెరువు గండి పడిన నేపథ్యంలో వందల ఎకరాల పంట పొలాలు నీట ము నిగి ఇసుక మేటలు వేశాయి. పెద్దఎత్తున నష్టం జరిగింది. మంత్రి ఉత్తమ్ మంగళవారం హుజూర్‌నగర్ పర్యటన నేపథ్యంలో బూరుగడ్డ చెరువు, రహదారిని పరిశీలించే అవకాశముంది.

అప్రమత్తమైన 'మూసీ' అధికారులు

కేతేపల్లి: మూసీ నీటిని విడుదల చేయడంతో సమాచారం లేని ఇద్దరు పశువుల కాపరులు ఆదివారం నీటిలో చిక్కుకున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మరోసారి అలాంటి సంఘటనకు ఆస్కారం లేకుండా మూసీ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి మరోసారి ప్రాజెక్టు మూడు క్రస్టుగేట్లు ఎత్తిన అధికారులు అంతకు ముందే మూసీ నది పరీవాహక ప్రాంతాలకు చెందిన సూర్యాపేట జిల్లాలోని మూడు మండలాలకు చెందిన 20గ్రామాలు, నల్లగొండ జిల్లాలోని నాలుగు మండలాలకు చెందిన 21గ్రామాల పశువుల కాపరులు, మత్స్యకారులు నదిలో నీటి ఉధృతి తగ్గే వరకూ నదిలోకి వెళ్లవద్దని అధికారులు సోషల్ మీడియా ద్వారా అప్రమత్తం చేశారు. భీమారం గ్రామానికి చెందిన ఇద్దరు పశువుల కాపరులు నది మధ్యలో వరద నీటిలో చిక్కుకున్న నేపథ్యంలో సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు దాదాపు ఆరేడు గంటల పాటు గేట్లను మూసివేశారు.

రెస్క్యూటీం నీటి నుంచి పశువుల కాపరులను బయటకు తీసుకు వచ్చాక రాత్రి 9గంటల ప్రాం తంలో మూసీ అధికారులు తిరిగి ప్రాజెక్టు గేట్లను ఎత్తారు. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో నిలకడగా ఉండడం, ప్రాజెక్టు 645అడుగుల గరిష్ట స్థాయిలో ఉండడంతో ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తిన అధికారులు వచ్చిన నీటిలో కొంత మేర నిల్వ చేస్తూ మిగితా నీటిని ప్రాజెక్టు మూడు గేట్లు, రెండు కాల్వల ద్వారా వదులుతున్నారు.

నీరు నేలపాలవుతున్నా..


వాల్వ్ నుంచి లీకవుతున్న కృష్ణా నీరు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 23: పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసిన వాల్వ్ నుంచి కృష్ణా నీరు లీకవుతోంది. ప్రతిరోజూ వందల లీటర్ల కృష్ణానీరు నేలపాలవుతోంది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం పైకి మిషన్ భగీరథ ద్వారా కృష్ణా నీటిని అందించేందుకు పైప్‌లైన్ వేశారు. నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్‌కు అనుసంధానిస్తూ దేవస్థానం నిధులు రూ.51లక్షలతో ప్రత్యేక పైప్‌లైన్ వేసి చెర్వుగట్టు క్షేత్రానికి చెందిన దేవుని బావి సమీపంలోని దేవస్థానం భూమి వద్ద 1.50లక్షల నీటి సామర్థ్యం ఉన్న సంప్‌కు నీటిని తరలించేలా ఏర్పాటు చేశారు. ఇందుకు గాను వెయ్యి లీటర్లకు రూ.60లు చొప్పున మేర మిషన్ భగీరథ విభాగానికి దేవస్థానం చెల్లిస్తుంది. అయితే గుట్టకింద బావి వద్ద దేవస్థానం భూమిలో ఉన్న సంపునకు నీటిని తరలించే పైప్‌లైన్‌లో గాలి నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన వాల్వ్ నుంచి కొద్దిరోజులకే నీటి లీకేజీ జరుగుతోంది. నీటిని సంప్‌లోకి పంపించే ప్రతి సారీ వాల్వ్ వద్ద లీకేజీ కారణంగా వందల లీటర్ల కృష్ణానీరు వృథాగా పారుతోంది. దేవస్థానం అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కృష్ణానీరు రాక కష్టాలు..


దెబ్బతిన్న కృష్ణానీరు సరఫరా చేసే పైప్‌లైన్

కేతేపల్లి, సెప్టెంబరు 23: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు రెండు రోజులుగా కృష్ణా నీటి సరఫరా నిలిచిపోయింది. కేతేపల్లి మండలంలోని 16 గ్రామపంచాయతీలకు, కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల చెరువు నుంచి కృష్ణా తాగునీరు సరఫరా అవుతుంది. ఈ క్రమంలో 65-వ నెంబర్ జాతీయ రహదారి వెంట కట్టంగూర్-అయిటిపాముల మధ్య కృష్ణా తాగునీటి సరఫరా మెయిన్ సప్లై పైప్‌లైన్ దెబ్బతిన్నది. దీంతో ఆది, సోమవారాల్లో నీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలుస్తుంది. పైప్‌లైన్ మరమ్మతులు పూర్తయితే నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు సమాచారం. పైప్‌లైన్ మరమ్మతులు జరుగుతున్నాయని మంగళవారం సాయంత్రానికి నీటి సరఫరా పునరుద్ధరించే వీలుందని కేతేపల్లి మండల మిషన్ భగీరథ ఏఈ రొయ్య మాధవి తెలిపారు.

పశ్చాత్తాపపడినా.. ప్రయోజనం ఉండదు

క్లిక్ క్లిక్

రోడ్డు నిబంధనలపై పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్రమాదకరంగా ప్రయాణిస్తూ ప్రమాదాలుకొని తెచ్చుకుంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత పశ్చాతాపం చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రమాదకర దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ


సూర్యాపేట జిల్లాకేంద్రంలో బైక్‌పై వెళ్తున్న ఐదుగురు విద్యార్థులు


నల్లగొండ జిల్లాకేంద్రంలో బైక్‌పై కూర్చొని భారీ వస్తువు తీసుకెళ్తున్న యువకుడు


నల్లగొండ పట్టణ శివారు గుండ్లపల్లిలో పత్తి ఏరడానికి ట్రాక్టర్‌లో వెళ్తున్న కూలీలు


నల్లగొండ జిల్లాకేంద్రంలో బైక్‌ను కాలుతో తోసుకెళ్తున్న యువకుడు


నల్లగొండలో ఆటో ట్రాలీ వాహన టాప్‌పై ఎలాంటి ఆధారం లేకుండా కూర్చున్న వ్యక్తి

మళ్లీ ఎక్కడా చెత్త వేయను..

● రోడ్డు పక్కన చెత్త వేసిన ప్రైవేట్ ఉద్యోగికి మునిసిపల్ సిబ్బంది పూలదండ
● మరోసారి ఇలా చేయబోనని తప్పు ఒప్పుకున్న ఉద్యోగి


ఉద్యోగిని పూలదండతో సన్మానిస్తున్న మునిసిపల్ సిబ్బంది

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 23: 'మళ్లీ ఎక్కడా కూడా చెత్తను పడేయను.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటా.. మునిసిపాలిటీ ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆటోలోనే చెత్త వేస్తా' అని ఓ ప్రైవేట్ ఉద్యోగితో మునిసిపల్ సిబ్బంది ప్రతిజ్ఞ చేయించి పూల దండతో సన్మానించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా 65వ జాతీయ రహదారి పక్కన మునిసిపల్ కార్మికులు చెత్తను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణ శివారు లింగోజిగూడెంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగి ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ నుంచి కంపెనీకి వెళుతూ ఇంటి నుంచి ప్లాస్టిక్ కవర్లలో తెచ్చిన చెత్తను జాతీయ రహదారి వెంట పడవేశారు. గమనించిన మునిసిపల్ పర్యావరణ ఇంజినీర్ రేణుకుమార్ వెంటనే ఆ ఉద్యోగిని అడ్డుకున్నారు. ఇలాంటి సంఘటనలు జరుగుతాయని ముందుగానే ఊహించిన మునిసిపల్ పర్యావరణ ఇంజినీర్ మూడు పూల దండలను కొనుక్కొని వెంట తెచ్చుకున్నారు. ఓ పూల దండతో చెత్త వేసిన ఉద్యోగిని సన్మానించారు. ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్త మునిసిపాలిటీ చెత్త సేకరణ ట్రాక్టర్లకు ఇవ్వాలని, ఇలా బహిరంగంగా వేయడం సరికాదని సిబ్బంది చెప్పారు. తప్పును అంగీకరించిన పరిశ్రమ ఉద్యోగి అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, వార్డు ఆఫీసర్స్ మహబూబ్ అలీ, బుచ్చిరాములు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే

ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ముప్పు

మఠంపల్లి, సెప్టెంబరు 23: మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కనీసం ఫెన్సింగ్ లేనందున ఎప్పుడు ఏ రూపంలో ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మఠంపల్లి, కృష్ణతండా, గుర్రంబోడుతండా, లాలితండా, తుమ్మల తండా తదితర గ్రామాల్లో రోడ్ల పక్కన, పాఠశాలల, సమీపంలో, ప్రధాన రహదారుల కూడలిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మఠంపల్లి మండల కేంద్రంలో తీగల్ చెర్వు సమీపంలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. చౌటపల్లి, కృష్ణతండా, తుమ్మలతండాలలో ప్రధాన రహదారి కూడళ్లలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నందున ప్రజలు భయందోళన చెందుతున్నారు. తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్లను ప్రమాదవశాత్తు ప్రజలతో పాటు మూగజీవాలు తాకి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ సమ స్యలను సంబంధిత ఏఈ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడ, కంచె ఏర్పాటు చేసి, శిథిలావస్థలో ఉన్న స్తంభాలను మార్చి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మఠంపల్లిలో పూర్తిగా దెబ్బతిన్న స్తంభం

ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సంబంధిత అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. మండలంలోని చౌటపల్లి గ్రామశివారులో, మఠంపల్లి ప్రధాన రహదారిలో పలు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను వెంటనే మార్చి ప్రాణ నష్టం జరగకుండా చూడాలి.

● మాలోతు సక్రునాయక్

విద్యుత్ స్తంభాలను త్వరగా మార్చుతాం

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరలో మార్చి మరమ్మతులు చేపడతాం. ప్రధాన రహదారి, చౌటపల్లి గ్రామ శివారులో 32కేవీ విద్యుత్ లైన్ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళతాం. మండలంలో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు, లైన్ సమస్యను మా దృష్టికి తీసుకువస్తే వెంటనే మరమ్మతులు చేపడతాం.

● హరీష్‌రెడ్డి, విద్యుత్ ఏఈ, మఠంపల్లి



తీగల్ చెర్వు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మూడు రోజుల నుంచి విద్యుత్ కోతలు

మండలంలోని మూడు రోజుల నుంచి ఐదారు గంటల విద్యుత్ కోతతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సరైన స్పందనలేదన్నారు. దీంతో విద్యుత్ అధికారుల తీరుపై విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అండర్ పాస్ వంతెనను నిర్మించొద్దు



తిరుమలగిరిలో అఖిలపక్ష నాయకులతో కలిసి రాస్తారోకోలో పాల్గొన్న వ్యాపారులు

తిరుమలగిరి, సెప్టెంబరు 23: తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో అండర్ పాస్ వంతెనను నిర్మించొద్దని అఖిలపక్ష నాయకుడు కొమ్మినేని సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో 300 మంది చిరు, మధ్య తరగతి వ్యాపారులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని అండర్‌పాస్ నిర్మించొద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ పాస్‌తో వ్యాపార అవకాశాలు పూర్తిగా దెబ్బతింటాయని, 1000 కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ప్రభుత్వం అండర్ పాస్ వంతెనను నిర్మించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సామేలుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కడెం లింగయ్య, సుంకరి జనార్దన్, కందుకూరి సోమన్న, కొత్తగట్టు మల్లయ్య, దీన్‌దయాల్, బత్తుల శ్రీను, తన్నీరు రాంప్రభు, ప్రవీణ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించాలి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 23: విద్యార్థులకు ఆంగ్ల భాష సులభంగా అర్థమయ్యేలా బోధించాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ అంజలి, ఎంఈవో సైదానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలో ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాలి ఫోనిక్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు నిత్యం విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యార్థులకు నేర్పాలన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక

తుంగతుర్తి, సెప్టెంబరు 23: సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ డీలర్ల మండల కమిటీని సోమవారం తుంగతుర్తిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మేనేని మాధవరావు, అధ్యక్షుడిగా నిమ్మల వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శిగా బొల్లం సైదులుయాదవ్, కోశాధికారిగా ఆకుతోట సోమన్నరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తుంగతుర్తి డివిజన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పూసపెల్లి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీలర్లు బండారు నాగన్న, సామా వెంకటేశ్వర్లు, బోయిని కొమరయ్య, గణేష్, లింగయ్య, వెంకటేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జానయ్యకు జాతీయ సాహితీ అవార్డు



ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 23: ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలూరి కరుణమ్మ స్మారక జాతీయ సాహిత్య అవార్డుకు మండలంలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన ఆరెంపుల జానయ్యను ఎంపిక చేశారు. తెలంగాణ ఉద్యమంలో జానయ్య కీలకపాత్ర పోషించారు. కవిగా, గాయకుడిగా టీవీ ఛానళ్లలో తెలంగాణ సాహిత్య జానపద పాటలు..మాటలతో జానయ్య అలరించారు. హైదరాబాద్‌లో ఈనెల 26వ తేదీన మంత్రి సీతక్క నుంచి అవార్డును జానయ్య అందుకోనున్నారు.

బడ్డీ కొట్లు తొగించొద్దు

కోదాడ, సెప్టెంబరు 23: పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న బడ్డీ కొట్లను తొలగించి రోడ్డు మీద పడేయొద్దని పలువురు చిరు వ్యాపారులు అన్నారు. ఈ మేరకు సోమవారం కోదాడలో ఎమ్మెల్యే పద్మావతిని కలిసి వినతిప్రతం అందజేశారు. బడ్డీ కొట్లను తొలగించాలని కోర్టు నుంచి ఇటీవల నోటీసులు వచ్చాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో దుకాణాలు నిర్మించి ఉపాధి చూపిన తర్వాతే బడ్డీ కొట్లను తొలగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బషీర్, అధ్యక్షుడు రసూల్, బాజాన్, బాగ్దాద్, అబ్బు, మదర్సా, వెంకన్న, పాషా, విజయ్, నాగేశ్వర రావు, రాము, జ్యోతి, సుజాత, పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలి

చిలుకూరు, సెప్టెంబరు 23: తమ గ్రామంలో చెరువు ఆక్రమణలను తొలగించాలని మండలంలోని నారాయణపురం గ్రామస్థులు కోరారు. కలెక్టరేట్‌లో జరిగిన సోమవారం గ్రీవెన్స్‌డేలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపురంలోని ఊరచెరువును కొంతమంది ఆక్రమించారని, ఆక్రమణలను తొలగించి సర్వే చేసి హద్దులు నిర్ణయించాలన్నారు. ఇటీవల వర్షాలకు తెగిన చెరువు కట్టను, గండ్లను పూడ్చి మరమ్మతు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వరద బాధిత రైతులు పాల్గొన్నారు.

రెడ్లకుంట మేజర్ కాల్వకు నీటి విడుదల

చిలుకూరు, సెప్టెంబరు 23: మండలంలోని ఆర్లెగూడెం వద్ద రెడ్లకుంట మేజర్ కాల్వకు పడిన గండిని పూడ్చి, నీటిని ఇరిగేషన్ అధికారులు సోమవారం విడుదల చేశారు. రెడ్లకుంట మేజర్‌కు గండిపడిన ప్రాంతంలో ఎస్కేప్ దెబ్బతినడంతో 10రోజుల నుంచి కాల్వ కట్టలు పటిష్ఠం చేసి, నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు అందేలా రైతులు సహకరించాలని ఇరిగేషన్ డీఈ స్వప్న, ఏఈ మానసలు కోరారు.

'లారీ ఓనర్స్ అసోసియేషన్ నుంచి తొలగించలేదు'

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 23: సూర్యాపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ నుంచి తనను ఎవరూ తొలగించలేదని ఆ సంఘం కార్యదర్శి గుండు సురేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను కార్యదర్శిగా తొలగించాలంటే జిల్లా అధ్యక్షుడితో పాటు అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేయాలన్నారు. తాను కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన 13నెలల్లోను అసోసియేషన్‌కు రూ.10లక్షలు సమకూర్చానన్నారు. కొందరు కావాలనే తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

సూర్యాపేట, సెప్టెంబరు 23: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేటలోని తొమ్మిదో వార్డులో నిర్వహించిన సీపీఎం శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటి వరకు ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని నేటికీ ఇవ్వలేదన్నారు. రేషన్ కార్డులు లేక రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్గూరి గోవిందు, వి.సాయికుమార్, శశిరేఖ, భాగ్యమ్మ, ఎల్లమ్మ, రాణి పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన అభినవ్

కోదాడ టౌన్, సెప్టెంబరు 23: క్రీడా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప క్రీడాకారుడు మేకల అభినవ్ అని పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు అన్నారు. మేకల అభినవ్ 23వ వర్ధంతి సందర్భంగా దొంగరి శ్రీను ఆధ్వర్యంలో సోమవారం కోదాడలోని బాలుర హైస్కూల్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి అభినవ్ తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు, అరుణతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అభినవ్ స్ఫూర్తితో కోదాడ నుంచి భావి క్రీడాకారులు చెస్‌లో రాణించాలన్నారు. అనంతరం బాలుర హైస్కూల్లో పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు, మునిసిపల్ వైస్ ఛైర్మన్ కందుల కోటేశ్వరరావు, ఎంఈవో సలీం షరీఫ్, వంగవీటి రామారావు, బొలిశెట్టి కృష్ణయ్య, పైడిమర్రి సత్తిబాబు, షేక్ నయీం, ఈదుల కృష్ణయ్య, చందర్‌రావు, దొంగరి శ్రీనివాస్, బాదె రాము, అంకతి అప్పయ్య, గంధం పాండు, కొమరగిరి రంగారావు, మదీనా, మీరా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అభినవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పట్టణవాసులు

'భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి'

హుజూర్‌నగర్, సెప్టెంబరు 23: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యలకసోమయ్యగౌడ్ కోరారు. సోమవారం పట్టణంలో యూనియన్ కార్యాలయం నుంచి ఇందిరా సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేల్ఫేర్ బోర్డు నిధులు సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. ప్రైవేటుకు ఇన్సూరెన్సు నిధులు అప్పగించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జయకృష్ణ, వెంకన్న, వేణు, రాంబాబు, వీరస్వామి, అంజయ్య, కాంతయ్య, సైదులు, పద్మ, నాగమ్మ, రేణుక పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

మునగాల, మునగాల రూరల్, సెప్టెంబరు 23: పేద కుటుంబానికి ఆర్థికసాయం అందించడం అభినందనీయమని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ అన్నారు. మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన మోడల్ స్కూల్ విద్యార్థిని పగిళ్ల మహేశ్వరి ఇంటర్ చదువుతూ అనారోగ్యం బారిన పడింది. మెరుగైన వైద్యం అందక వారం రోజుల క్రితం మృతి చెందింది. ఆమె తల్లిదండ్రులు కూడా పదేళ్ల క్రితం మృతి చెందారు. ఆ కుటుంబంలో ఇద్దరు తమ్ముళ్లు సాయి, భార్గవ్, నాయనమ్మ మిగిలారు. ఈ కుటుంబానికి గణపవరం కృష్ణ యూత్ సభ్యులు రూ.22900, అంబేద్కర్ యూత్ సభ్యులు రూ.3వేలు అందజేశారు.

'చిలుకూరు సీఈవోపై చర్యలు తీసుకోవాలి'

చిలుకూరు, సెప్టెంబరు 23: చిలుకూరు ప్రాథమిక సహకార సంఘంలో రైతులందరికీ రుణమాఫీ కాకపోవడానికి కారణమైన సీఈవో పై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. రుణమాఫీ ఫైళ్లను ఆన్‌లైన్ చేయనందునే ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 41మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని, తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

'భారంగా మారిన డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే'

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 23: డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే భారంగా మారిందని వ్యవసాయ విస్తరణాధికారులు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేవని, మహిళా అధికారులు భూముల వద్దకు ఒంటరిగా వెళ్లి, ఎలాసర్వే చేయగలరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జానయ్య, ఉప్పయ్య, శ్రీకాంత్, నరేష్, గోపి, సతీష్, రియాజ్, అనూష పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తిరుమలగిరిలో స్వీపర్లకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

తిరుమలగిరి, తుంగతుర్తి, అర్వపల్లి, సెప్టెంబరు 23: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలు, స్వీపర్లు, దడువాయి కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు, తహసీల్దార్ హరిబాబు, మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్, సుంకరి జనార్దన్, జుమ్మీలాల్, మూల అశోక్‌రెడ్డి, సంకెపల్లి నర్సింహారెడ్డి, సామ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

●తుంగతుర్తి మండల కేంద్రంలోని 40మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మందుల సామేలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, సింగిల్‌విండో చైర్మన్ గుడిపాటి సైదులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్ పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉంటాం

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మీతో పాటు సంక్షేమ పథకాలు అందజేస్తూ అండగా ఉంటానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి తహసీల్దార్ కార్యాలయంలో 36మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలో రూ.5కోట్లతో అభివృద్ధి పనులు చేశానన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో నాలుగేళ్లలో తారు రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించే బాధ్యత తనదేనని అన్నారు. నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కుతో పాటు ప్రతి మండలానికి ఐటీ కళాశాలలను సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేస్తానన్నారు. గోదావరి జలాలతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. తిమ్మాపురం-కోడూరు, కోడూరు-సంగెం గ్రామాలకు రోడ్ల నిర్మాణాలకు రూ.32కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.శ్రీనివాసులు, ఎంపీడీవో పవన్‌కుమార్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, నాయకులు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, మహరాజు, దాసరి సోమయ్య, వెంకటేశ్వర్లు, పాలెల్లి సురేష్, జీడి నాగరాజు, ఉప్పలయ్య, వెంకటస్వామి, లింగరాజు, నిద్ర సంపత్‌నాయుడు పాల్గొన్నారు.

నూతన కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేయాలి

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 23: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ అన్నారు. జాతీయ కార్మిక సంఘాల బ్లాక్‌డే సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను హరించే విధంగా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, కనీస వేతన హక్కును సాధించుకోగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శులు డి.రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, వెంకన్న, శ్రీను, లింగయ్య, శ్రీధర్, వీరయ్య, రావు, అంజయ్య, శ్రీకంట్లం, కృష్ణ, నర్సయ్య, అంజద్, యాకమ్మ, సావిత్రి, సైదమ్మ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య అన్నారు. నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా హుజూర్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాయల రాము, అచ్చమ్మ, సావిత్రి, వెంకన్న, వెంకటమ్మ, రామరాజు పాల్గొన్నారు.



సూర్యాపేటలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కోదాడ రూరల్: నూతన కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాలు డిమాండ్ చేశారు. కోదాడ డిపోలో సీఐటీయూ, ఆర్టీసీ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు ఆర్టీసీలో యూనియన్లను అనుమతించనందున కార్మికుల పక్షాన యాజమాన్యంతో మాట్లాడే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఆర్.సోమన్న, ఏఎస్ రావు, శ్రీకాంత్, నర్సయ్య, ఇమాం పాషా, సైదులు, వినయ్, కరిముల్లా పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నేరేడుచర్ల, సెప్టెంబరు 23: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి సూచించారు. 'సఫాయి మిత్ర - సురక్ష శివిర్' కార్యక్రమంలో భాగంగా ప్రజా మరుగుదొడ్ల వద్ద పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

హుజూర్‌నగర్: పట్టణంలో పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని మునిసి ఎల్ కమిషనర్ యాకుబ్ పాషా కోరారు. సోమవారం పట్టణంలోని గాంధీపార్కు సెంటరులో మునిసిపల్ సిబ్బంది రోడ్డును శుభ్రం చేయించి, బాలికల పాఠశాలలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రహదారి బంగ్లా నుంచి గాంధీపార్కు వరకు 2కే రన్ నిర్వహించి మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ లతీఫ్, రాజశేఖర్, అశోక్, నాగిరెడ్డి, రంగారవు, జనార్దన్ పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ' సేవలో భాగస్వాములు కావాలి

కోదాడ టౌన్, సెప్టెంబరు 23: 'స్వచ్ఛతా హీ' సేవలో ప్రజలు భాగస్వాములు కావాలని అగ్నిమాపక కేంద్ర అధికారి సీహెచ్ శ్రీనివాస్ కేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చందా అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం మూడు యూనిట్లు సంయుక్తంగా నిర్వహించిన 'స్వచ్ఛతా హీ' సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వలంటీర్లు కోదాడలో అగ్నిమాపక కేంద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.నిర్మలకుమారి, వి.వెంకటేశ్వరరెడ్డి, కళాశాల పీడీ ప్రాన్సిస్, సైదులు, రాజు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి అన్నారు. రాంరెడ్డి వరూదినీదేవి జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోలగాని బాలుగౌడ్, గండూరి రమేష్, గాజుల రాంబాయమ్మ, వల్దాస్ లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, పటేల్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ దేవాలయం వద్ద పూలు, పండ్లు విక్రయించడా నికి, కొబ్బరి చిప్పలు సేకరించడానికి మంగళవారం వేలంపాటలు నిర్వహిస్తామని ఈవో కుశలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి పూలు, పండ్లు విక్రయించ డానికి రూ.1.50 లక్షలు. కొబ్బరి చిప్పలు సేకరించడానికి రూ.లక్ష డీడీ తీసి, మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే వేలంపాటకు హాజరుకావాలన్నారు.

ఆత్మకూర్(ఎస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో నెం.81, 85, 98తో పదోన్నతి పొంది 55 నుంచి 61 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వృద్ధ వీఆర్ఏ కుటుంబాలను ఆదుకోవాలని పూర్వ వీఆర్ఏలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

చివ్వెంల: ఎస్ఎఫ్‌సీ నిధులను వెంటనే మంజూరు చేయాలని మండల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల కానందున గ్రామపంచాయతీల కార్యనిర్వహణ భారం పంచాయతీ కార్యదర్శులపై పడిందన్నారు.

హుజూర్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన వీడియోగ్రాఫర్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు టి.గణేష్, ఏడుకొండలు శంకర్ కోరారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే చెల్లిస్తామన్నారు.

గరిడేపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెలిదండ గ్రామంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి, మేదరమెట్ల సీతారామయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు రైతులు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నవీన్, సోమయ్య, సుశీల, కిరణ్, రవి పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మూలగుండ్ల వెంకటరెడ్డిని నేరేడుచర్ల లయన్స్ క్లబ్, పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చిల్లేపల్లి, నేరేడుచర్ల, చింతకుంట్ల జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు దీప్లానాయక్, బట్టు మధు, వెంకటరెడ్డి, పీఆర్టీయూ నాయకులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, మాతంగి సైదులు, కట్టా శ్రీనివాసరెడ్డి, కొండయ్య, వీరారెడ్డి, నాగార్జున్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. సత్కరించారు.

మఠంపల్లి: విద్యార్థినులు సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు అన్నారు. మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉన్నతంగా ఎదగాలన్నారు. బాలికలకు సమస్యలు ఎదురైతే ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకోరావాలన్నారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, అంజనేయచార్యులు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, ఫౌండేషన్ నిర్వాహకులు సహకరించాలని సర్వేజనా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బండారు కవిత అన్నారు. దొండపాడు గ్రామంలోని జడ్పీ హైస్కూ ల్‌లో రూ.6వేల విలువైన నోట్ పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రషిరుద్దిన్, మస్తాన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకవీడు: మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు జరిగే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు అనంతప్రకాష్ అన్నారు. పాలకవీడులో నిర్వహించిన మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లా డారు. కేంద్రంలోని బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముషం నర్సింహ, పగడాల మట్టేష్, ఏసురత్నం, మల్లారెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వివిధ రకాల 19 ద్విచక్ర వాహనాలకు తుంగతుర్తి ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 25వ తేదీన వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు తుంగతుర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎక్సైజ్ సీఐ రజిత ఒక ప్రకటనలో తెలిపారు.

● హైదరాబాద్‌లో మంగళవారం జరిగే రాష్ట్ర రేషన్ డీలర్ల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఓర్సు వెంకన్న కోరారు. మంగళవారం తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రేషన్ల డీలర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

●ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య కోరారు. తుంగతుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వెంకన్న, మధు, నవీన్, వెంకట్‌రెడ్డి, వెంకటమల్లు, హకీం పాల్గొన్నారు.

మద్దిరాల: ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం కవులు, కళాకారులు కళారూపాలతో, డప్పు దరువులతో మద్దిరాల మండల కేంద్రంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరాల యాదగిరి, కళాకారులు పాముల కృష్ణ, ఆకారపు ఉపేందర్, అజయ్, సారగుండ్ల శ్రీను, పాముల వెంకటేష్, అంజి, క్రాంతి, సంతోష, నాగలక్ష్మి, వెంకటమ్మ, సువర్ణ, అరుణ పాల్గొన్నారు.

నాగారం: పత్తి రైతులు దళారులు చేతిలో మోసపోకుండా రైతులకు మద్దతు ధర అందించడానికి తిరుమలగిరిలో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ సీసీఐ అధికారులను కోరారు. రైతులు నష్టపోకుండా సీసీఐ అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.